నమస్తే తెలంగాణ
మహబూబాబాద్

5 | వరంగల్, శనివారం 31 ఆగస్టు 2024 | MAHABUBABAD

మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన పెసర

పెసరకు పిసరంతే ధర

- మార్కెట్‌లో అన్నదాతకు దక్కని మద్దతు
- క్వింటాకు రూ. 2500కు పైగా నష్టం
- పూత దశలో వరుస వానలతో తగ్గిన దిగుబడి
- తక్కువ ధరకు కొంటున్న వ్యాపారులు
- ప్రభుత్వమే కొనుగోలు చేయాలంటున్న రైతులు

కేసముద్రం, ఆగస్టు 30 : ఆరుగాలం కష్టించి పెసర పంటను పండిస్తే.. మార్కెట్‌లో పిసరంతే ధర పలుకుతుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. పప్పు దినుసుల సాగు నిలుపునా ముంచిందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది జిల్లాలోని రైతులు సుమారు 5,420 ఎకరాల్లో పెసర పంటను సాగుచేశారు. పూత దశలో వరుస వర్షాలు పడడంతో ఏపుగా పెరిగి చేను నేల వాలడంతో దిగుబడి తగ్గిపోయింది. ఎకరాకు 5 నుంచి 7 క్వింటాళ్లు రావాల్సి ఉండగా కేవలం రెండు నుంచి మూడు క్వింటాళ్లే వచ్చింది. కొంత మంది రైతులు పెట్టిన పెట్టుబడి కూడా దక్కడం లేదని చేనులోనే కలియదున్నుతున్నారు. ఎకరం సాగుకు రూ.15 వేల వరకు పెట్టుబడికి ఖర్చు కాగా, దిగుబడి రాక, ధర లేక రైతులకు రెక్కల కష్టం కూడా మిగలడం లేదు.

దక్కని మద్దతు ధర..

క్వింటా పెసరకు ప్రభుత్వ మద్దతు ధర రూ.8,682 ఉండగా మార్కెట్‌లో గురువారం మోడల్ ధర రూ. 6,533, కనిష్ఠంగా రూ. 3,639 పలికింది. దీంతో రైతులు మద్దతు ధరకంటే రూ. 2500 వరకు నష్టపోతున్నారు. పంట కొనుగోలుకు ప్రభుత్వ రంగ సంస్థ ముందుకు రాకపోవడంతో వ్యాపారులు తక్కువ ధరకు కొంటున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఒకటి, రెండు రాశులకు అధిక ధర పెట్టి మిగిలిన వాటికి తక్కువ ధర కేటాయిస్తున్నట్లు వాపోతున్నారు. బహిరంగ మార్కెట్‌లో పెసర పప్పు కేజీకి రూ. 125 పలుకుతున్నదని, కానీ వ్యాపారులు మాత్రం పెసర పంటను తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ తమను నష్టాలపాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎకరంలో సాగుకు అయ్యే ఖర్చు (రూ..)

దుక్కి దున్నడానికి	3,500
విత్తనం వేయడానికి	1,000
దుక్కి మందుకు	1,200
కూలీలకు	700
కలుపు నివారణకు	1,000
పాటు చేయడానికి	3,000
పురుగు మందులకు	1,500
హార్వెస్టర్‌కు	3,000
మొత్తం	14,900

ఆర్థికంగా నష్టపోయిన..

నేను నాలుగు ఎకరాల్లో పెసర పంట సాగు చేసిన. వరుసగా వర్షాలు పడి పంట దెబ్బతిని దిగుబడి తగ్గింది. సాగు చేసిన నాటి నుంచి పంటను మార్కెట్‌కు తీసుకవచ్చే వరకు సుమారు రూ.70 వేల ఖర్చు వచ్చింది. మార్కెట్‌లో క్వింటాకు రూ. 5,669 ధర పలికింది. ఏడు క్వింటాళ్లకు రూ. 40 వేలు వచ్చినయి. పంట సాగు చేసి రూ. 30 వేలు నష్టపోయిన. ప్రభుత్వం రైతు భరోసా డబ్బులిస్తే నష్టం తగ్గేది. వెంటనే ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులు నష్టపోకుండా చూడాలి.

– పిట్టల ఎల్లయ్య, రైతు, బ్రాహ్మణకొత్తపల్లి, నెల్లికుదురు మండలం

రెక్కల కష్టం మిగలడం లేదు

పెసర పంటను సాగు చేస్తే లాభం రాకపోగా రెక్కల కష్టం మిగలడం లేదు. ఎకరం భూమిలో పంటను సాగు చేస్తే సుమారు 3 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మార్కెట్‌కు తీసుకురాగా క్వింటాల్‌కు రూ. 5,019కి కొనుగోలు చేశారు. ఈ ధరకు పెట్టిన పెట్టుబడి రాకపోగా నష్టాన్ని మూట కట్టుకున్న. ప్రభుత్వం పెట్టుబడికి డబ్బులు ఇవ్వకపోవడం, మద్దతు ధర కల్పించకపోవడం వల్ల నష్టపోయిన. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించాలి.

– గుగులోత్ ప్రమీల , రైతు, తొర్రూరు.

తక్షణం స్పందించి.. ఊపిరి పోసి !

నవజాత శిశువుకు కృత్రిమ శ్వాస అందించిన 108 సిబ్బంది

నవజాత శిశువుకు అంబూ బ్యాగ్‌తో ఆక్సిజన్ అందిస్తున్న ఈఎంటీ స్వాతి

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 30 : అప్పుడే పుట్టిన శిశువుకు శ్వాస తీసుకోవడం కష్టమైంది. సమస్య తీవ్రతను గుర్తించిన వైద్యులు.. ఎంజీఎంలోని పీడియాట్రిక్ వార్డుకు తరలించాలని నిర్ణయించి వెంటనే 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది తక్షణమే స్పందించి ఆ నవజాత శిశువుకు కృత్రిమ శ్వాస అందించి ఊపిరి పోసేందుకు శ్రమించిన తీరుకు అందరూ సలాం కొట్టారు. వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రిలో శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. శాంతినగర్‌కు చెందిన సద్దాం హుస్సేన్ భార్య రమీషాబేగం మొదటి కాన్పులో బాబుకు జన్మనిచ్చింది. అయితే శ్వాస తీసుకోవడంలో లోపాన్ని గుర్తించిన వైద్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించేందుకు 108కు సమాచారమిచ్చారు. హుటాహుటిన సిబ్బంది అక్కడకు చేరుకొని బాబుకు అంబూ ద్వారా కృత్రిమ శ్వాస అందిస్తూ పీడియాట్రిక్ వార్డుకు తరలించారు. ఈ క్రమంలో బాబుకు ఊపిరి అందించేందుకు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ స్వాతి, పైలట్ సదానందం చూపిన చొరవ, తాపత్రయాన్ని ప్రతి ఒక్కరూ అభినందించారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఎన్‌పీడీసీఎల్‌లో జేఎల్ఎంల నియామకాలు

వరంగల్,ఆగస్టు 30 : ఎన్‌పీడీసీఎల్ ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం)ల నియామకాలు చేపట్టనున్నట్లు ఎస్ఈ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు అర్హులైన అభ్యర్థులకు విద్యుత్ స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లతో సెప్టెంబర్ 3న ఉదయం 10 గంటలకు ములుగురోడ్‌లోని ఉత్తర విద్యుత్ శిక్షణ సంస్థలో హాజరుకావాలని తెలిపారు. అభ్యర్థులకు వారి పరీక్ష తేదీలను ఉత్తరం ద్వారా సమాచారం అందించామని, హనుమకొండలోని సర్కిల్ కార్యాలయం నోటీసు బోర్డుపై కూడా జాబితా, పరీక్షల తేదీలను ఉంచామని తెలిపారు. నియామకాలు పారదర్శకంగా జరుగుతాయని, దళారులను ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దని ప్రకటనలో పేర్కొన్నారు.

విధుల్లో చేరని జీఎంహెచ్ సూపరింటెండెంట్

బాధ్యతలు స్వీకరించేందుకు విముఖత

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 30 : హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి దవాఖాన (జీఎంహెచ్) సూపరింటెండెంట్‌గా బదిలీపై వచ్చిన అధికారి బాధ్యతలు స్వీకరించేందుకు విముఖత చూపుతున్నట్లు సమాచారం. నెల రోజుల క్రితం జరిగిన బదిలీల్లో భాగంగా హైదరాబాద్ నుంచి జీఎంహెచ్‌కు ప్రొఫెసర్ కే రాజేశ్వరి బదిలీ అయ్యారు. ఆమెకు సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతి కల్పించినప్పటికీ బాధ్యతలు స్వీకరించడానికి ఆసక్తి చూపించకపోవడంతో బీ విజయలక్ష్మి సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్నారు. రాజేశ్వరి బాధ్యతలు స్వీకరించకపోవడంపై ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు తెలిసింది.

ఆర్ఎంవో అంబరీష్‌కు డెంగ్యూ

మహబూబాబాద్ నుంచి జీఎంహెచ్‌కు బదిలీపై వచ్చిన ఆర్ఎంవో అంబాల అంబరీష్‌కు డెంగ్యూ వచ్చింది. ఆర్ఎంవోగా బాధ్యతలు స్వీకరించిన నాలుగు రోజులకే తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఆయన తెలంగాణ డయాగ్నొస్టిక్స్‌లో వైద్యపరీక్షలు చేయించుకున్నారు. 12 వేలకు ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో ఇదే దవాఖానలో ఫ్లూయిడ్స్ ఎక్కించుకున్నారు. అయినప్పటికీ జ్వరం తగ్గకపోవడంతో హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

మూతపడిన హాస్టల్‌కు సిబ్బంది కేటాయింపు

ఇన్‌చార్జి వార్డెన్, నైట్ వాచ్‌మెన్ నియామకం

ఆత్మకూరులో నిరుపయోగంగా ఉన్న ఎస్సీ హాస్టల్

ఆత్మకూరు,ఆగస్టు 30 : హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో మూతపడిన ఎస్సీ బాలుర హాస్టల్‌కు అధికారులు సిబ్బందిని కేటాయించారు. ఇన్‌చార్జి వార్డెన్, నైట్ వాచ్‌మెన్‌ను నియమించారు. ఈ విద్యా సంవత్సరం మొదటి నుంచి ఈ హాస్టల్‌లో విద్యార్థులు చేరలేదు. గతంలో ఉన్న ఆరుగురు వేరే హాస్టల్‌కు వెళ్లిపోగా, వార్డెన్ శ్రీనివాస్‌ను హనుమకొండకు బదిలీ చేశారు. అయితే జిల్లా అధికారులు మాత్రం హనుమకొండలో పనిచేస్తున్న వార్డెన్ సదానందంకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో పాటు ఒక నైట్‌వాచ్‌మెన్‌ను కూడా నియమించారు. ప్రస్తుతం వారిద్దరు ఇటు వైపు వచ్చిన దాఖలాలు లేవు. ఈ హాస్టల్‌లోని తొమ్మిది గదులు, రెండు కిచెన్‌లు తాళాలు వేసి దర్శనం ఇస్తున్నాయి. మూతపడిన హాస్టల్‌కు సిబ్బందిని నియమించడం విడ్డూరంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. ఈ హాస్టల్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని అధికారులు కోరుతున్నారు.

‘దేవాదుల’కు రూ. 200 కోట్లు కేటాయించండి

మంత్రి ఉత్తమ్‌కు ఎమ్మెల్యే పల్లా విజ్ఞప్తి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, ఆగస్టు 30(నమస్తే తెలంగాణ): ‘దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పనుల కోసం రూ.200 కోట్లు కేటాయించండి.. జనగామ నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుంది’ అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కోరారు. శుక్రవారం భువనగిరి పట్టణంలో నిర్వహించిన పార్లమెంట్ స్థాయి నీటి పారుదల శాఖ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని తపాస్‌పల్లి రిజర్వాయర్ 4 మోటర్లు ఆన్‌చేసి చెరువులు నింపాలని కోరారు. నియోజకవర్గ ప్రజల తరపున చేతులు జోడించి విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు.

సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, సీతక్క, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యేలు, అధికారులు

డెడ్‌లైన్ 2026

మార్చి కల్లా దేవాదులను పూర్తిచేస్తాం..

ములుగు, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ)/కన్నాయిగూడెం : దేవాదుల ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను తరలించి ఉమ్మడి వరంగల్, నల్గొండ, కరీంనగర్ ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం దేవాదుల పంపుహౌస్, మోటర్లతో పాటు ఇన్‌టేక్ వెల్, సమ్మక్క బరాజ్‌ను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం గోదావరి నదికి పూజలు చేశారు. ప్రాజెక్టు పనుల పురోగతిని నీటి పారుదల శాఖ ఈఎండీసీ అనిల్, సీఈలు విజయ్‌భాస్కర్, అశోక్‌కుమార్‌లు దశలవారీగా పనుల వివరాలు, ఖర్చు చేసిన నిధులు, రావాల్సిన నిధులు, పెండింగ్ పనులకయ్యే ఖర్చు, పనుల ఆలస్యానికి గల కారణాలు, భూసేకరణ లోపానికి కారణాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రులకు వివరించారు. అనంతరం నీటి పారుదల శాఖ అధికారులతో మంత్రులు సమీక్ష నిర్వహించారు.

మార్చి 2026 కల్లా పూర్తిచేస్తాం..

ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు పలు నియోజకవర్గాలకు సాగునీటితో పాటు తాగునీరు అందించేందుకు చేపట్టిన జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టును 2026 మార్చి నాటికి పూర్తిచేసి సోనియా గాంధీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామీణ తెలంగాణ ముఖచిత్రం మార్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఒక్కో ప్రాజెక్టును రివ్యూ చేసుకుంటూ పనులు కొనసాగించేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. పాలమూరు రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులతో దేవాదుల ప్రాజెక్టును సైతం పూర్తి చేసేందుకు అధిక ప్రాధాన్యతతో చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రాజెక్టు నిర్మించే క్రమంలో సంవత్సరానికి 170రోజుల పాటు 38 టీఎంసీలను ఎత్తిపోసేలా డిజైన్ చేశామని, ప్రస్తుతం సమ్మక్క బరాజ్ అందుబాటులోకి రావడంతో నీటి సామర్థ్యం పెరిగిందన్నారు. ఈ నీటిని ఉపయోగించుకునేలా దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఒక సంవత్సరంలో 300 రోజుల పాటు నీళ్లను లిఫ్ట్ చేసి ఎత్తిపోతల ద్వారా 60 టీఎంసీల గోదావరి జలాలను దేవాదుల ద్వారా సాగునీటితో పాటు తాగునీటిని అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతి ఎకరానికి నీరు అందేలా కృషి చేస్తామని చెప్పారు. సమ్మక్క బరాజ్ అనుమతులను సాధించేందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో మాట్లాడి ఎన్ఓసీ తీసుకొని కేంద్ర జల సంఘం ద్వారా నీటి అనుమతులు సాధిస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధులు చెప్పిన అన్ని విషయాలను సాధ్యమైనంత వరకు పరిశీలిస్తామని చెప్పారు. భూసేకరణ విషయంలోనూ మానవీయ కోణంలో ఆలోచించి రైతులకు కోరిన ధర చెల్లిస్తామని తెలిపారు. ప్రాజెక్టుల భూసేకరణ కోసం ప్రత్యేకంగా ఐఏఎస్ అధికారిని నియమించామని, కలెక్టర్లతో సమన్వయం చేసుకొని అడ్డంకులు లేకుండా చూస్తామన్నారు. మోడికుంట ప్రాజెక్టును కూడా అనుమతులు కల్పించి త్వరలో పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు. ఇరిగేషన్ శాఖను బలోపేతం చేసేందుకు 700మంది ఏఈలను ఇటీవల భర్తీ చేశామని అన్నారు. అలాగే 1800మంది లష్కర్లను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లో సిల్ట్‌ను తొలగించేందుకు ఈ-సిల్టింగ్‌తో పాటు కెనాళ్లలో జంగల్ కట్టింగ్ పనులను కూడా ప్రారంభిస్తామన్నారు. దీనికి రూ.1100 కోట్లను కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు.

దేవాదుల ప్రాజెక్టు పైలాన్ వద్ద మంత్రులు, అధికారులు

దేవాదులకు మొదటి ప్రాధాన్యమిస్తాం : మంత్రి పొంగులేటి

రాష్ట్రంలో 14 ఏళ్లుగా నత్తనడకన కొనసాగుతున్న దేవాదుల పనులను వేగవంతం చేసేందుకు మొదటి ప్రాధాన్యమిచ్చి గ్రీన్‌చానల్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పెండింగ్ బిల్లులు లేకుండా కాంట్రాక్టర్లకు చెల్లిస్తూ పూర్తి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దేవాదుల ద్వారా 3లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తున్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ అంత మేర అందడం లేదని తమ దృష్టికి వచ్చిందని 5లక్షల 50వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా కృషిచేస్తామన్నారు. ప్రాజెక్టు కోసం ఇంకా 3వేల ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉందని, రూ.1150 కోట్లను ఖర్చు చేయాల్సి ఉందని తెలిపారు. నవంబర్ 15లోగా చిన్న చిన్న పనులను పూర్తి చేస్తామని చెప్పారు. దేవాదుల సమీపంలో గోదావరిపై సమ్మక్క బరాజ్ నిర్మించడం ద్వారా పంప్‌హౌస్ వద్ద 5 నుంచి 6టీఎంల సామర్థ్యం పెరిగిందని, వీటిని కూడా ఎత్తిపోతల ద్వారా లిఫ్టింగ్ చేస్తామని, దానికి తగిన ఆదేశాలను సైతం ప్రభుత్వం ద్వారా జారీ చేస్తామని మంత్రి అన్నారు. గత ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు ఇచ్చేందుకు వెనకాడేది లేదన్నారు. ఇప్పటికే 7వేల కోట్లను చెల్లించామని తెలిపారు.

- గోదావరి జలాలతో సస్యశ్యామలం చేస్తాం
- తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యం
- 300 రోజుల పాటు 60 టీఎంసీలను ఎత్తిపోస్తాం
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- ప్రాజెక్టు పనుల వేగవంతానికి గ్రీన్‌చానల్ : మంత్రి పొంగులేటి
- ములుగు నియోజకవర్గానికి దేవాదుల ద్వారా సాగునీరందించాలి
- భూ నిర్వాసితులకు తగిన పరిహారం అందిస్తాం : మంత్రి సీతక్క
- ఉమ్మడి జిల్లాలకు దేవాదుల వరప్రదాయిని : మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

ములుగుకు సాగునీరు అందించాలి : మంత్రి సీతక్క

దేవాదుల ద్వారా ఇతర ప్రాంతాలకు నీళ్లు తరలుతున్నప్పటికీ ములుగు నియోజకవర్గానికి మాత్రం అందడం లేదని, గత ప్రభుత్వం రామప్ప నుంచి లక్నవరానికి గ్రావిటీ కెనాల్ ద్వారా నీటిని తరలించేందుకు భూసేకరణ జరపగా ఎకరానికి రూ.3లక్షల నష్టపరిహారమే ప్రకటించిందని, ప్రస్తుతం భూమి విలువ పెరిగినందున నిర్వాసితులకు తగిన పరిహారం అందిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. మల్లూరు ప్రాజెక్టుకు గంగారం వాగును మళ్లించి నీటి సామర్థ్యాన్ని పెంచాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం వచ్చేలా ప్రాజెక్టుల ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. రామప్ప, లక్నవరం లింకును పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గంలోని చెరువులు, కుంటలను గోదావరి జలాలతో నింపేలా చర్యలు చేపడుతామన్నారు.

సమగ్ర ప్రణాళికతో నీరందించాలి : మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

దేవాదుల ప్రాజెక్టు ఉమ్మడి జిల్లాకు వరప్రదాయిని వంటిదని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. 15 సంవత్సరాల నుంచి పనులు నత్తనడకన సాగుతున్నాయని అన్నారు. సమ్మక్క బరాజ్ ద్వారా ఎగువ నుంచి వస్తున్న నీటిని నిల్వ చేస్తూ దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా తరలించి ఆయకట్టును పెంచాలన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాను దృష్టిలో ఉంచుకొని సమగ్ర ప్రణాళికతో నీటిని అందించాలని కోరారు. సాధ్యమైనంత త్వరలో అధిక ప్రాధాన్యతను ఇస్తూ పూర్తి చేయాలని ప్రకాశ్ కోరారు. సమావేశంలో నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్వినీ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, కె.ఆర్.నాగరాజు, డాక్టర్ మురళీనాయక్, కలెక్టర్ టి.ఎస్. దివాకర, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, ఎస్పీ పి.శబరీష్, ఓఎస్డీ మహేశ్ బాబా సాహెబ్ గీతే, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎస్పీ రవీందర్, ఈఈలు, డీఈలు, ఏఈలు, మెఘా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



రాయపర్తి పీఏసీఎస్‌లో కూపన్ల కోసం బారులు తీరిన రైతులు

యూరియా కోసం అగచాట్లు

- కూపన్ల కోసం సొసైటీ వద్ద రైతుల పడిగాపులు
- అధిక ధరలు, కొర్రీలతో వ్యాపారుల ఇష్టారాజ్యం

రాయపర్తి, ఆగస్టు 30 : యూరియా బస్తాల కోసం కొద్ది రోజులుగా రైతులు అగచాట్లు పడుతున్నారు. ప్రైవేట్ వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తుండటంతో వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం వద్ద పడిగాపులు కాస్తున్నారు. అధికారుల అలసత్వం, ప్రభుత్వ పర్యవేక్షణ లోపంతో మండలంలోని 40 గ్రామ పంచాయతీల పరిధిలోని రైతులు యూరియా బస్తాల కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు రాయపర్తిలోని పీఏసీఎస్ భవనం, గోదాం ఎదుట బారులు తీరుతున్నారు. శుక్రవారం సొసైటీ భవనం వద్ద యూరియా కోసం వందల సంఖ్యలో రైతులు ట్రాక్టర్‌లు, ఆటోలు, మోటర్ సైకిళ్లు, ఎడ్లబండ్లతో తరలి వచ్చి కూపన్ల కోసం క్యూలో నిల్చున్నారు.

దుకాణాదారుల ఇష్టారాజ్యం..

రాయపర్తి మండల కేంద్రంతో పాటు మైలారం, సన్నూరు, పెర్కవేడు, కాట్రపల్లి, కొండూరు, కొలన్‌పల్లి, కేశవాపురం, ఊకల్, కొండాపురం, కొత్తూరు తదితర గ్రామాల్లోని ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ వ్యాపారులు రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని దోపిడీ పాల్పడుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఒక్కో బస్తాకు రూ.340-350 వరకు వసూలు చేస్తున్నారని, యూరియా కోసం మరో ఎరువును కొనాల్సిందేనని కొర్రీలు పెడుతున్నారని మండిపడుతున్నారు. అసలే వర్షాలు పడక ఉన్న కొద్దిపాటి నీటితో వరి, పత్తి పంట సాగు చేసుకుంటున్న తమకు కనీసం యూరియాను కూడా సమృద్ధిగా రాష్ట్ర ప్రభుత్వం అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొసైటీలో రూ. 275కే యూరియా బస్తాలను అందజేస్తుండటంతో చేసేది లేక పొద్దంతా క్యూలో నిలబడి కొనుగోలు చేస్తున్నట్లు చెపుతున్నారు. అయితే ఒక ఆధార్ కార్డుకు 5 బస్తాలే ఇస్తున్నారని, దీంతో తాము ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నదంటున్నారు. రైతులకు సరిపడా యూరియా బస్తాలు అందించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోజుకు 80 టన్నుల యూరియా తెప్పిస్తున్నాం

రైతుల అవసరాలకు అనుగుణంగా రోజుకు రెండు లారీల్లో సుమారు 80 టన్నుల యూరియా బస్తాలను తెప్పించి పంపిణీ చేస్తున్నాం. మండలంలోని రాయపర్తి, ఊకల్, తిర్మలాయపల్లి గ్రామాల్లోని సొసైటీ గోదాముల్లో యూరియా పంపిణీ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. యూరియా కొరత లేనప్పటికీ రైతులంతా ఒకేసారి బస్తాల కోసం వస్తుండడంతో క్యూలు కన్పిస్తున్నా యి. కృత్రిమ కొరత సృష్టించడంతోపాటు లింకు వ్యాపారాలు చేసే వారి వివరాలిస్తే ఆకస్మిక సోదాలు జరిపి దోషులుగా తేలిన దుకాణదారుల లైసెన్స్‌లు రద్దు చేస్తాం.

– గుమ్మడి వీరభద్రం, ఏవో, రాయపర్తి

రుణమాఫీ వెంటనే క్లియర్ చేయాలి

- రైతులను ఇబ్బందులు పెట్టవద్దు
- ఇందుకోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం
- అధికారులతో సమీక్షలో మంత్రి సీతక్క
- రుణమాఫీపై బ్యాంకర్లు స్పందించరా?
- ములుగు కలెక్టర్ దివాకర ఆగ్రహం

మాట్లాడుతున్న మంత్రి సీతక్క పక్కన కలెక్టర్ దివాకర

ఏటూరునాగారం, ఆగస్టు 30 : రుణమాఫీ పెండింగ్ లేకుండా త్వరగా క్లియర్ చేయాలని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క బ్యాంకర్లను ఆదేశించారు. ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు, వైద్యాధికారులతో కలెక్టర్ టీఎస్ దివాకర, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రాతో కలిసి ఆమె సమీక్షించారు. రుణమాఫీ కింద ప్రభుత్వం ములుగు జిల్లాలోని బ్యాంకులకు రూ.190 కోట్లను విడుదల చేయగా ఇప్పటివరకు రూ.101 కోట్లు మాత్రమే క్లియర్ చేసినట్లు తెలుస్తున్నదని, మిగతావి ఎందుకు పెండింగ్ పెడుతున్నారని బ్యాంకు అధికారులను ప్రశ్నించారు. రైతులను బ్యాంకుల చుట్టూ తిప్పించుకుని ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు సహాయం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతులు తరచూ బ్యాంకుల చుట్టూ తిరగడం వల్ల వారి సమయం వృథా అవుతుందన్నారు. రుణమాఫీ కోసం ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బ్యాంకుల్లో ప్రత్యేక సమయం కేటాయించి రుణమాఫీ అమలుచేసేలా బ్యాంకర్లు చొరవ చూపాలన్నారు. గ్రీవెన్స్ ఏర్పాటు చేసుకొని వచ్చే వినతులు స్వీకరించి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. జిల్లాలో యూరియా కొరత లేకుండా చూడాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. వ్యవసాయ ప్రణాళికను ముందస్తుగా సిద్ధంచేసుకోవాలన్నారు. ములుగు పర్యటనపై గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేశారని, అధికారులంతా బాగా పనిచేశారని, అదే స్ఫూర్తితో నిత్యం జిల్లాలోని ప్రజల కోసం పనిచేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విషజ్వరాలు ప్రబలకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ దివాకర మాట్లాడుతూ రుణమాఫీ అమలులో బ్యాంకర్లు సకాలంలో స్పందించడం లేదన్నారు. ఒక్క బ్యాంకు కూడా సరైన నివేదిక ఇవ్వకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేయగా ఒకటి రెండు రోజుల్లో క్లియర్ చేస్తామంటూ బ్యాంకర్లు సమాధానమిచ్చారు. సమావేశంలో డీఎంహెచ్‌వో అప్పయ్య, ములుగు ఏరియా వైద్యశాల, ఏటూరునాగారం సామాజిక వ